జాతీయ దిన పత్రిక

తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 92 14-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీస్

48 గంటల్లో క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్

లేకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ మంత్రి సీతక్క లీగల్ నోటీసు పంపారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ, తన ప్రతిష్టకు భంగం కలిగేలా బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ మంత్రి సీతక్క నోటీసు జారీ చేశారు.

శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

తండ్రి చనిపోతే సిఎంకోసం పైరవీలు

మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు

2లో

బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టనివ్వం

హుమాయూన్, మమత ఇద్దరూ ఒక్కటే

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫైర్

2లో

నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

- మహిళా రిజర్వేషన్లపై ప్రధాని
- 2029 నుంచే చట్టసభల్లో అమలు
- ఈ శతాబ్దికే అతి ముఖ్య నిర్ణయం
- నారీ శక్తి వందన్ సదస్సులో మోదీ

న్యూఢిల్లీ: చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం మహిళల దశాబ్దాల ఎదురుచూపులకు అతి త్వరలో తెర పడనుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేలా నారీ శక్తి వందన్ అధినియమ్‌కు రాజ్యాంగ సవరణ చేపట్టనున్నట్టు గుర్తు చేశారు. ఇందుకోసం గురువారం నుంచి పార్లమెంటు

- మిగతా 2వ పేజీలో



హార్ముజ్ దిగ్బంధం

- ఇరాన్ రేవులను నిర్బంధించిన అమెరికా
- వాటినుంచి నౌకల రాకపోకలపై నిషేధం
- అమెరికా చర్యలపై తీవ్రంగా మండిపడ్డ ఇరాన్
- గల్ఫ్ పోర్టులపై దాడులు చేస్తామని హెచ్చరిక
- పశ్చిమాసియాలో రాజుకుంటున్న ఉద్రిక్తతలు
- కాల్పుల విరమణ కొనసాగింపుపై అనిశ్చితి
- ట్రంప్ కోరితే యుద్ధానికి సిద్ధమేనన్న ఇరాన్
- కొత్త 'వ్యూహా'లను ప్రయోగిస్తామని వ్యాఖ్యలు

హార్ముజ్ పూర్తిగా మా ఆధీనంలోనే: ఐఆర్‌జీసీ

దుబాయ్: పశ్చిమాసియా ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపు దాలుస్తున్నాయి. చర్చల వైఫల్యంపై మండిపడుతున్న అమెరికా మరోసారి ఇరాన్‌పై తీవ్ర చర్యలకు దిగుతోంది. సోమవారం సాయంత్రం నుంచి హార్మ్యూజ్ జలసంధితో పాటు ఇరాన్‌కు చెందిన ఓడరేవులన్నింటినీ దిగ్బంధించింది. హార్మ్యూజ్ గుండా ఇరాన్ ఓడల రాకపోకలను కూడా అడ్డుకుంటోంది. చర్చలు విఫలమైతే హార్మ్యూజ్‌ను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారమే హెచ్చరించడం తెలిసిందే. అమెరికా నావికా దళం సోమవారం సాయంత్రమే రంగంలోకి దిగింది. ఇరాన్ తీర ప్రాంతాలన్నింటినీ పూర్తిస్థాయిలో పహారా కాస్తోంది. ఏ దేశానికి చెందిన నౌకలూ ఇరాన్ రేవుల్లోకి రాకపోకలు జరపడానికి వీల్లేదని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అయితే, ఇరానేతర రేవుల నుంచి వచ్చే నౌకలను మాత్రం హార్మ్యూజ్ గుండా వెళ్లేందుకు అనుమతిస్తామని వెల్లడించడం విశేషం!

- మిగతా 2వ పేజీలో

జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదం

- జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన నిమ్మల రామానాయుడు
- "ఉన్మాద రాజకీయాలు" అంటూ మండిపడ్డ మంత్రి
- హామీలు, విధానాలపై తీవ్ర ఆరోపణలు
- వైఎస్సార్‌సీపీపై కఠిన వ్యాఖ్యలు.. రాజకీయ వేడి పెరుగుతోంది

2లో

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు..

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ లేదు!

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు

నిజామాబాద్ మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ స్థాపించినా, పాదయాత్ర చేసినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టే పాదయాత్రను

- మిగతా 2వ పేజీలో

హైబ్రిడ్‌గా సీట్లు పెంచాలి

- పెంచే 272 లోక్‌సభ సీట్లలో 136 జనాభా లెక్కన,
- మరో 136 జీఎస్‌డీపీ ప్రకారం రాష్ట్రాలకు కేటాయించాలి
- ప్రధాని ప్రతిపాదన వల్ల దక్షిణాది, ఉత్తరాది మధ్య భారీ అంతరం
- కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ సాధించారు.. ఇప్పుడు పునర్విభజనపైనా పోరాడతారు
- ఈ పోరాటంలో దక్షిణాదితోపాటు చిన్న రాష్ట్రాలనూ ఏకం చేస్తాం
- దామాషా ప్రకారం సీట్లు పెరిగితే బండి, కిషన్‌రెడ్డి బంట్రోతులుగా మిగిలిపోతారు

2లో

జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ శైలిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు నిప్పులు చెరిగారు. జగన్ చేస్తున్న రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంలా ఉన్నాయని, రాష్ట్రంలో విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. "చంపుతాం, నరుకుతాం, అంతం చేస్తాం" అనేవి జగన్ రాజకీయ నిఘంటువులో ప్రధాన పదాలుగా మారిపోయాయని ధ్వజమెత్తారు. జగన్ ఇచ్చే రాజకీయ హామీలు అత్యంత భయంకరంగా ఉన్నాయని మంత్రి విమర్శించారు. అధికారంలోకి వస్తే ఉన్నవి పడగొడతామని, పనులు ఆపేస్తామని, యువతను మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుస్తామని జగన్ పరోక్షంగా చెబుతున్నారని ఆరోపించారు. కొత్త రకమైన మాదక ద్రవ్యాలను తీసుకువచ్చి యువతకు దాన్నే ఉపాధిగా చూపించడమే జగన్ 'యూత్ పాలసీ' అని ఎద్దేవా చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ గురించి మాట్లాడకుండా, 'రప్పా రప్పా' అంటూ నరుకుతామనడం ఆయన ఉన్మాదానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. రాజకీయ ఎదుగుదల కోసం జగన్ తన సొంత బాబాయ్ వివేకాను కూడా వదల్లేదని మంత్రి ఆరోపించారు. "రాజకీయంగా అడ్డొస్తే సొంత బాబాయ్ నైనా అంతం చేయడమే జగన్ విధానం" అని వ్యాఖ్యానించారు. గతంలో వివేకాను బలవంతంగా ఎంపీ పదవికి రాజీనామా చేయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, తండ్రి ఆచూకీ లభ్యం కాకముందే సంతకాలు చేయించుకున్న జగన్ నైజాన్ని ఎండగట్టారు. గతంలో పరిటాల రవి హత్య కేసు నుండి జగన్ ను బయటపడేయడానికి తనకు ఆరు నెలలు పట్టిందని మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్న మాటలను ఆయన గుర్తు చేశారు. వంగవీటి రంగా హత్య ఉదంతాన్ని ప్రస్తావిస్తూ జగన్ పై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. రంగాను హత్య చేసిన కుటుంబం ఇప్పుడు ఎవరి అండన ఉందని ప్రశ్నించారు. రంగాను 'రౌడీ' అని అవమానించిన గౌతమ్ రెడ్డికి ఫైబర్ గ్రిడ్ చైర్మన్ పదవి ఇచ్చి సత్కరించిన జగన్, ఇప్పుడు రంగా కుటుంబం ఏ పక్షాన ఉందో గమనించాలని సూచించారు. రంగా హత్యలో ప్రధాన నిందితుడి కుటుంబానికి హైదరాబాద్‌లో రూ. 1000 కోట్ల విలువైన స్థలాలను గిఫ్ట్‌గా ఎందుకు ఇచ్చారని జగన్‌ను నిలదీశారు. జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తొలుత ఆర్థిక ఉగ్రవాదిగా మారి వ్యవస్థలను కలుషితం చేశారని, ఆ తర్వాత రాజకీయ పార్టీ పెట్టి పాలనను, అధికారులను కూడా భ్రష్టు పట్టించారని రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఇప్పుడు "గొడ్డలి పార్టీ"గా మారిందని, వినాశనం , విధ్వంసమే దాని ఎజెండా అని విమర్శించారు. ఇలాంటి ఉన్మాద రాజకీయాలకు రాష్ట్రంలో శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

నారీ శక్తికి పట్టం కట్టేందుకే!

మూడు రోజుల పాటు సమావేశం కానుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో జరిగిన 'నారీ శక్తి వందన్'సదస్సును ఉద్దేశించి మోదీ మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల రూపంలో ఈ శతాబ్దిలోకెల్లా అతి ముఖ్యమైన నిర్ణయాన్ని భారత్ అతి త్వరలో తీసుకోబోతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దాన్ని నారీ శక్తికే అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. "మహిళా రిజర్వేషన్ల చట్టానికి రాజ్యాంగ సవరణ ద్వారా మన పార్లమెంటు కొత్త చరిత్ర సృష్టించనుంది. మనందరి జీవితకాలంలో దేశ చరిత్రలోనే అతి ముఖ్యమైన నిర్ణయంగా ఇది మిగిలిపోనుంది. మహిళా సాధికారతకు నిదర్శనంగా, వారి శక్తియుక్తులకు నిజమైన నివాళిగా నిలవనుంది. భారత్‌లో స్త్రీ పురుష సమతావాదం, సామాజిక న్యాయం కేవలం నినాదాలు కావని, రోజువారీ పని సంస్కృతి మొదలుకునిఅత్యున్నత నిర్ణయ ప్రక్రియ దాకా అన్నింట్లోనూ అవి విడదీయలేని భాగమని నిరూపించనుంది. భారత మహిళలు ఇప్పటికే పాలనలో అన్ని స్థాయిల్లోనూ నిర్ణాయక పాత్ర పోషిస్తూ తమను తాము నిరూపించుకుంటున్నారు. మున్ముందు మరిన్ని పెద్ద బాధ్యతలను సమర్థంగా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారు"అంటూ కొనియాడారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2027 జనగణనతో ముడిపడి ఉన్నాయి. దాంతో ప్రస్తుత చట్టం ప్రకారం వాటిని 2034 నుంచి మాత్రమే అమలు చేయడం వీలు పడుతుంది. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను 816కు పెంచనున్న నేపథ్యంలో 273 స్థానాలు మహిళలకు రిజర్వు కానున్నాయి.

ఒక్క ఆడదానిపై 19 రాష్ట్రాలు, కేంద్రం పని చేస్తున్నాయి..

యోధురాలిగా పోరాడతానన్న మమత

తనకు వ్యతిరేకంగా 19 రాష్ట్రాలు, కేంద్రం పని చేస్తున్నాయని.. అయినా కూడా ఒంటరి యోధురాలిగా పోరాడతానని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీర్భూమ్ జిల్లాలోని సూరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఢిల్లీ బలంతో బెంగాల్ ప్రజలను ప్రభావితం చేసి ఎన్నికల్లో గెలవడం సాధ్యం కాదన్నారు. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 226కు పైగా సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనకు వ్యతిరేకంగా 19 రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ఏకమయ్యాయని, కానీ తాను మాత్రం సామాన్య ప్రజల హక్కుల కోసం ఒంటరిగా పోరాడుతున్నానని తెలిపారు. అయినా ఢిల్లీ శక్తితో బెంగాల్‌ను గెలవలేరన్నారు. ఢిల్లీ నుంచి వచ్చే బయటి శక్తులు, వనరుల సహాయంతో బెంగాల్ ప్రజలను ప్రభావితం చేయడం అంత సులభం కాదని పేర్కొన్నారు. బెంగాల్‌ను విషపు కళ్లతో చూస్తే.. మీ కళ్లు పీకేస్తాను అని వార్నింగ్ ఇచ్చారు. మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమంపై మమతా బెనర్జీ ప్రశ్నలు లేవనెత్తారు. యువత మనసులను ప్రభావితం చేయడానికి ఈ కార్యక్రమాన్ని వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. 'మన్ కీ బాత్ ద్వారా యువతను ప్రభావితం చేయడానికి ప్రయత్నం జరుగుతోంది, కానీ బెంగాల్ యువతకు సత్యాసత్యాల మధ్య తేడా తెలుసు, వారు చైతన్యవంతులు" అని అన్నారు.

హైబ్రిడ్‌గా సీట్లు పెంచాలి

హైదరాబాద్: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు బిల్లులపై కేంద్ర ప్రభుత్వం హడావుడి చేస్తోందని.. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండు వేర్వేరనే విషయాన్ని మరుగున పెట్టి, రెండింటినీ జనాభా లెక్కల తర్వాత ఆమోదింప చేసుకోవాలని ప్రధాని మోదీ యోచిస్తున్నారని విమర్శించారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని.. ప్రపంచంలోనే భారత్‌లో మహిళలకు ఓటు హక్కు కల్పించిన పార్టీ కాంగ్రెస్ అని రేవంత్ గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు కేవలం జనాభా ప్రాతిపదికన చేయడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక నిర్మాణం, రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకొని సీట్ల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. అందుకోసం 'హైబ్రిడ్ మోడల్' అవసరమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పెంచబోయే 272 లోక్‌సభ స్థానాల్లో 136 సీట్లను జనాభా ప్రాతిపదికన మరో 136 సీట్లను జీఎస్‌డీపీ ఆధారంగా ఆయా రాష్ట్రాలకు కేటాయించాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు, ఎంపీలతో కలిసి సచివాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

హైబ్రిడ్ విధానంతో సమన్యాయానికి అవకాశం

'దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదాయం, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. జాతీయ స్థూల ఉత్పత్తి జీఎస్‌డీపీలో దక్షిణాది రాష్ట్రాలే ముందున్నాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించడం తగదు. పన్నులు కట్టడం, సలాం కొట్టడం అనే దానికి మేం వ్యతిరేకం. అందుకే హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదిస్తున్నాం. లోక్‌సభలో ప్రస్తుతమున్న 543 సీట్లను 50 శాతం మేర పెంచితే సీట్లు 816కు చేరుతాయి. పెరిగే 272 సీట్లలో 136 దామాషా (ప్రొరాటా) ప్రకారం పెంచుకొని మరో 136 సీట్లను ఆర్థికంగా దేశానికి అందిస్తున్న సేవల ఆధారంగా పెంచాలి. ఈ సీట్ల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో చర్చించాలి. పార్లమెంటులో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. 2027 మార్చి 31లోగా జనగణన, 2028 మార్చిలోగా పునర్విభజన పూర్తి చేసి 2029లో పెరిగిన సీట్లతో ఎన్నికలకు వెళ్లవచ్చు'అని రేవంత్ సూచించారు. 'నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లును ఒకటిగా చూపిస్తూ కేంద్రం హడావుడి చేస్తోంది. ఈ రెండింటికీ ఎలాంటి సంబంధం లేదు. వేర్వేరుగా చర్చించి అమలు చేయాలి. మహిళల రిజర్వేషన్ బిల్లు విషయంలో ఆలస్యం చేయడానికి ఈ పద్ధతి ఉపయోగిస్తున్నారు. దేశంలో ప్రధానిగా, రాష్ట్రపతిగా, స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా మహిళలకు అవకాశాలు కల్పించింది కాంగ్రెస్. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారు. సోనియా గాంధీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లు2013లో రాజ్యసభలో ఆమోదం పొందింది. కానీ బీజేపీ సహకరించకపోవడంతో లోక్‌సభలో నిలిచిపోయింది. 2023లో మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చింది. 2024 ఎన్నికల్లోనే 33% రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 181 మహిళలు లోక్‌సభలో ఉండేవారు. 2026 జనాభా లెక్కల తర్వాత అంటే మహిళల హక్కులను వాయిదా వేయడమే. నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోదించాలి'అని సీఎం సూచించారు. 'దేశంలో 1970 ప్రాంతంలో కుటుంబ నియంత్రణ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేశాయి. అందుకే జనాభా తగ్గింది. ఉత్తరాదిలో నియంత్రణ లేకపోవడంతో జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభా ఆధారంగా సీట్లు పెంచితేం మంచి పనిచేసిన రాష్ట్రాలను శిక్షించినట్లే అవుతుంది. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గమనించి లోక్‌సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపును ఇందిరాగాంధీ నిషేధించారు.

బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టనివ్వం

రాణిగంజ్: టీఎంసీ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ చీఫ్ హుమాయూన్ కబీర్ ఇద్దరూ ఒక్కటేనని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. బెంగాల్‌లో బీజేపీ గెలిస్తే హుమాయూన్ ప్రకటించినట్లుగా బాబ్రీ మసీదును నిర్మించనివ్వబోమని స్పష్టం చేశారు. సోమవారం ఆయన బీర్భూమ్, పశ్చిమ్ బర్ధమాన్ జిల్లో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు. అప్పట్లో అయోధ్యలో రామాలయం నిర్మాణాన్ని మమతా బెనర్జీ వ్యతిరేకించగా.. ఆమె పార్టీ మాజీ నేత ఇప్పుడు అయోధ్యలో కూల్చిన బాబ్రీ మసీదును నిర్మించేందుకు చూస్తున్నారన్నారు. '550 ఏళ్లుగా టెంట్ కిందే ఉంటున్న రామ్ లల్లాను అలా ఉంచేందుకే కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, బీఎస్పీలు మద్దతు తెలిపాయి. తిరుగులేని మెజారిటీతో గెలిచిన మోదీ ప్రభుత్వం మాత్రమే అయోధ్యలో రామాలయాన్ని నిర్మించింది. మమతా బెనర్జీ మాదిరిగా ఆలోచించే హుమాయూన్ ఇప్పుడు బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టాలనుకుంటున్నారు'అని అమిత్ షా వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బాబ్రీ మసీదు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టం చేశారు. బాంబులు, బుల్లెట్లకు బెంగాల్ ప్రజలు ఓట్లతోనే సమాధానం చెబుతారన్నారు. టీఎంసీ ప్రభుత్వాన్ని సాగనంపండి, ఆ వెంటనే సిండికేట్ కట్‌మనీ ముఠాదార్లను, వారి మద్దతుదార్లను తలకిందులుగా వేలాడదీసి, తాము దారికి తెస్తామని హెచ్చరికలు చేశారు. టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీకి టాటాబైబై చెప్పి, బీజేపీకి అధికారమిచ్చేందుకు ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారన్నారు.

కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీస్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి తరఫున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ లీగల్ నోటీసును పంపించారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని, టెండర్ ఈవాల్యుయేషన్ కమిటీ తీసుకున్న నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ కేటాయించబడిందని నోటీసులో మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అలాగే మొత్తం టెండర్ విలువ రూ.44 కోట్లే ఉన్నప్పటికీ.. అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇవన్నీ పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణలని పేర్కొన్నారు. ఈ విధమైన ప్రచారం తన ప్రతిష్టను దెబ్బతీసే కుట్రగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్రచారానికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ నేరుగా బాధ్యత వహించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటలలోపు ఈ పోస్టులను తొలగించి, బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. లేకపోతే తన ప్రతిష్టను దెబ్బతీసిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని మంత్రి సీతక్క లీగల్ నోటీసులో స్పష్టం చేశారు. మంత్రి సీతక్క నోటీసులపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కేసీఆర్ ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు..

(మొదటి పేజీ తరువాయి)

తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ప్రతి రాజకీయ కార్యక్రమాన్ని ఆదరిస్తామన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ లేదు అని మహేష్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చినా, కొత్త పేర్లతో వచ్చినా వచ్చే ఎన్నికల్లో అధికారం మాత్రం కాంగ్రెస్‌దే అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసినా ప్రజలు తమ వెంటనే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమకు గట్టి పోటీదారులే లేరన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ కాలంలో రాష్ట్రంలో విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయని, ముఖ్యంగా సింగరేణిలో జరిగిన ఒప్పందాలు అన్నీ గత ప్రభుత్వ కాలంలోనే జరిగాయని పేర్కొన్నారు. సింగరేణిలో జరిగిన అవినీతిని కార్మికులు ఎప్పటికీ మరిచిపోరని మహేష్ గౌడ్ చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో మళ్లీ పునరుజ్జీవం పొందే అవకాశం లేదని టీపీసీసీ చీఫ్ అన్నారు. కల్వకుంట్ల కవితకు ఫండింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. పోచారం చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఉండటం సహజమని తెలిపారు. పోచారం పెద్ద మనసుతో పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రతినెలా సుమారు 7 వేల కోట్ల రూపాయల అప్పులు కాంగ్రెస్ చెల్లిస్తోందని, అయినప్పటికీ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

అమరావతి :శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోనిటీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్దాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.

హార్మూజ్ దిగ్బంధం

ఇరాన్ 'ఫాస్ట్ అటాక్'షిప్‌లు గనక తమ నావికా దళం దిగ్బంధించిన ప్రాంతాల సమీపంలోకి వస్తే మరో ఆలోచనే లేకుండా వాటిని తక్షణం పేల్చేస్తామని ట్రంప్ అల్టిమేటమిచ్చారు. అమెరికా తాజా చర్యతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు విపరీతంగా పెరిగేలా కన్పిస్తున్నాయి. అంతేగాక ట్రంప్ ప్రకటించిన రెండు వారాల కాల్పుల విరమణ కూడా బుట్టదాఖలయ్యేలా కన్పిస్తోంది. దాని గడువు ఏప్రిల్ 22 దాకా ఉంది. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం ద్వారా అమెరికా సాధించబోయేది ఏమిటో అర్థం కావడం లేదంటూ అంతర్జాతీయ నిపుణులు పెదవి విరుస్తున్నారు. అగ్ర రాజ్యం తాజా చర్యలపై ఇరాన్ మండిపడింది. గల్ఫ్ ప్రాంతంలోని ఓడరేవులన్నింటినీ పూర్తిస్థాయిలో లక్ష్యం చేసుకుని దాడులకు దిగుతానని తీవ్రంగా హెచ్చరించింది. "పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్ర ప్రాంత రక్షణ బాధ్యత ఈ ప్రాంతంలోని ప్రతి దేశానిదీ. మాపై దాడులు, దిగ్బంధాలు జరిగితే ఈ ప్రాంతంలోని ఏ రేవూ సురక్షితం కాబోదు"అని ఇరాన్ సైన్యం, రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) స్పష్టం చేశాయి. హార్మూజ్ ఇప్పటికీ పూర్తిగా ఇరాన్ అదుపులోనే ఉన్నట్టు చెప్పుకొచ్చాయి. ద'ట్రంప్‌కు యుద్ధమే కావాలనుకుంటే మేం సిద్ధమే'అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గలీబాఫ్ స్పష్టం చేశారు. అంతేగాక 'ఆటలో ఇప్పటిదాకా వాడని సరికొత్త 'వ్యూహా'లను ఇకపై బయటికి తీస్తా'మంటూ ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అధికార ప్రతినిధి ఎబ్రాహీం రజెయ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా నుంచి అమెరికా ఖాళీ చేతులతో వెనుదిరగాల్సిందేనని ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ విభాగం చీఫ్ ఎస్మాయిల్ ఖానీ ఎద్దేవా చేశారు. గత వారం కాల్పుల విరమణ మొదలైనప్పటి నుంచి 40 వాణిజ్య నౌకలు హార్మూజ్‌ను దాటాయి. అమెరికా, ఇరాన్ నడుమ యుద్ధానికి తెర దించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్టు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. హార్మూజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ ఎద్దేవా చేసింది. ఈ మేరకు గమ్మత్తైన గణిత సమీకరణాలతో ఎక్స్‌లో పోస్టు పెట్టింది. "హార్మూజ్ దిగ్బంధంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిపోతాయి. తర్వాత జరిగే చైన్ రియాక్షన్ వల్ల చూస్తుండగానే అవి చుక్కలనంటుతాయి"అంటూ వాటి అర్థాన్ని కూడా వివరించింది!

'హార్మూజ్'పై భేటీ.. బ్రిటన్, ఫ్రాన్స్ వెల్లడి

లండన్/పారిస్: పశ్చిమాసియా యుద్ధానికి తెర దించి హార్మూజ్ జలసంధిని తక్షణం తెరిపించే ప్రయత్నాలను బ్రిటన్, ఫ్రాన్స్ ముమ్మరం చేశాయి. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ వారంలో సమావేశం నిర్వహించనున్నట్టు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ వెల్లడించారు. ఈ అంశంపై వారిద్దరూ ఫోన్లో చర్చలు జరిపారు. అమెరికా చేపట్టిన హార్మూజ్, ఇరాన్ రేవుల దిగ్బంధానికి బ్రిటన్ మద్దతివ్వబోదని స్టార్మర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

100 మంది హెజ్బొల్లా ఫైటర్ల మృతి!

బీరూట్: ఇజ్రాయెల్ సైన్యం, హెజ్బొల్లా దళాలు సోమవారం లెబనాన్‌లో పరస్పర దాడులకు దిగాయి. దక్షిణాదిన వ్యూహాత్మకంగా కీలకమైన కొండ ప్రాంత పట్టణం బింట్ బెల్ వద్ద ఇజ్రాయెల్ సైన్యంపై హెజ్బొల్లా తీవ్రవాదులు రాకెట్లతో దాడి చేశారు. అయితే పట్టణంపై ఇజ్రాయెల్ సైన్యం పట్టు సాధిస్తున్నట్టు లెబనాన్ మీడియా తెలిపింది.



ప్రతిభకు పట్టాభిషేకం.. నేహశ్రీకి ఘన సన్మానం

- ఇంటర్ ఫలితాల్లో 466 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు
- చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో రూ.10 వేల నగదు పురస్కారం ప్రదానం

తొలివెలుగు, చౌటుప్పల్: పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించింది చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తోర్పునూరి నేహశ్రీ. తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచింది. మొత్తం 470 మార్కులకు గాను ఏకంగా 466 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకును కైవసం చేసుకుని తన స్వగ్రామానికి, తల్లిదండ్రులకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చింది. నేహశ్రీ సాధించిన ఈ అరుదైన విజయానికి గుర్తింపుగా గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, స్థానిక 1వ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థిని నేహశ్రీని వారు శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థిని భవిష్యత్తు చదువులకు ప్రోత్సాహకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆమెకు రూ. 10 వేల నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇలా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం మనందరికీ గర్వకారణం. నేహశ్రీ స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు చదువులో రాణించాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వాటర్ ప్లాంట్ విరాళం

- ఆదర్శంగా నిలిచిన అన్నాచెల్లెళ్లు

తొలివెలుగు, రాజపేట: కన్నవారిపై ప్రేమను, పుట్టిన ఊరిపై ఉన్న మమకారాన్ని చాటుకుంటూ ఓ అన్నాచెల్లెళ్లు ఆదర్శంగా నిలిచారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్వగ్రామానికి ఓ వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన నారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఆయన సోదరి నారెడ్డి అనూష రెడ్డి తమ తల్లిదండ్రులు నారెడ్డి భాగ్యమ్మ, రంగారెడ్డిల స్మారకార్థం ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు తాగునీటి కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని గ్రహించిన వీరు, ఆ కష్టాన్ని తీర్చేందుకు ముందుకొచ్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సురక్షిత తాగునీటి కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన దాతలు శ్రీకాంత్ రెడ్డి, అనూషలను గ్రామ సర్పంచ్ ఇండ్ల రాజయ్య, ఉప సర్పంచ్ పుప్పాల సిద్దులు, ఇతర గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, వార్డు సభ్యులు ఇంజ కరుణాకర్, ఇండ్ల రజనీకాంత్, భీమనపల్లి కృష్ణకుమార్, ఇండ్ల అలివేలు, ఇంజ శ్యామల, గ్రామ పెద్దలు పురుషోత్తం, విష్ణుమూర్తి, యాదగిరి, బాల సిద్ధులు, కృష్ణ, కృష్ణమూర్తి, వెంకట్ రెడ్డి, కుమార్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ, పాఠశాల ఉపాధ్యాయులు, లైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

తొలివెలుగు, రాజపేట: ప్రయాణాల్లో అజాగ్రత్త ప్రాణాంతకమని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పుట్టగూడెం తండా సర్పంచ్ రాంజీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పుట్టగూడెం తండా గ్రామపంచాయతీలో రోడ్డు భద్రతపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరితో హెల్మెట్ ధరిస్తామని, నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 70 శాతం మరణాలు హెల్మెట్ లేకపోవడం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే వ్యక్తిపై ఒక కుటుంబం మొత్తం ఆధారపడి ఉంటుందని, వాహనదారులు బాధ్యతగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఆపి భద్రతా సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రెండింగ్‌లో స్టాక్ ట్రేడింగ్ మోసాలు

స్టాక్ ట్రేడింగ్‌లో భారీ లాభాలిప్పిస్తామంటూ నమ్మిస్తూ ప్రతి రోజు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో రూ.3 కోట్ల కంటే ఎక్కువగా సైబర్‌నేరగాళ్లు మోసం చేస్తున్నారు. ట్రేడింగ్ మోసాలలో బాధితులంతా అత్యాశకు పోయి మోసపోతున్న వారే ఉండడం ఆందోళన కల్గిస్తోంది. సోషల్‌మీడియా ఫ్లాట్‌ఫామ్‌ను అడ్డగా చేసుకొని సైబర్‌నేరగాళ్లు బాధితులను ఆకర్షిస్తున్నారు. ఈ స్టాక్ ట్రేడింగ్ ప్రకటనలను చూసి, లింక్‌లు క్లిక్ చేస్తూ నేరగాళ్లు వేసే వలలో చిక్కుతున్నారు. ఆ తరువాత కొంత మొత్తం పెట్టి అదృష్టాన్ని పరీక్షించుకుందామని వెళ్లేవారు కొందరైతే.. సైబర్‌నేరగాళ్లు చెప్పేది నిజమని నమ్మి పెట్టుబడి పెట్టేవాళ్లు కొందరు ఉంటున్నారు. సైబర్‌నేరగాళ్లు స్టాక్ ట్రేడింగ్ మోసాలు చేసేందుకు రోజు రోజుకు కొత్త కొత్త ఎత్తులతో సోషల్‌మీడియాలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ ప్రకటనలలో ఏఐ ఆధారిత వీడియోలను సైతం తయారు చేస్తూ, ప్రముఖల వీడియోలు తయారు చేస్తున్నారు. ఇందులో కేంద్ర ఆర్థిక మంత్రి వీడియోలు, ప్రతిపక్ష నాయకుల వీడియోలు, ప్రముఖ సంస్థల ప్రతినిధుల వీడియోలను తయారు చేసి అమాయకులను మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటికి ఎక్కువగా రిటైర్డు ఉద్యోగులు మోసపోతుండడం ఆందోళన కల్గిస్తోంది. ట్రై పోలీస్ కమిషనరేట్లలోని సైబర్‌ఠాణాలకు వచ్చే ఫిర్యాదులలో 70 శాతం ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ఉంటుంది. అందులో ఒక్కో కమిషనరేట్‌లో ప్రతి రోజు కోటి నుంచి రూ.1.5 కోట్లకుపైగా మోసపోతున్న కేసులు నమోదవుతున్నాయి.

వీటిని ఆరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు మరింత పెంచాల్సిన అవసరముంది. అయితే స్టాక్ ట్రేడింగ్ పేరుతో మోసపోతున్న వాళ్లంతా విద్యావంతులే ఉండడం గమనార్హం. వనస్థలిపురంలో నివాసముండే బాధితుడు ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తుండగా 10క్రిక్.కామ్ అనే వెబ్‌సైట్ కనిపించింది. దానిని క్లిక్ చేయడంతో వాట్సాప్ గ్రూప్‌కు యాడ్ అయ్యింది. ఆ గ్రూప్‌లో అందరు తాము ఫలాన స్టాక్‌లో పెట్టుబడి పెడితే ఇంత లాభం వచ్చిందంటూ చెప్పుకుంటున్నారు. ఆ మేసేజ్‌లను చూసిన బాధితుడు నిజమని నమ్మి 10క్రిక్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అకౌంట్ క్రియేట్ చేసుకున్నాడు. మొదట రూ. 10 వేలు పెట్టుబడి పెట్టడంతో అందులో నుంచి రూ.వెయ్యి విత్ డ్రా చేసుకున్నాడు. లాభాలు వస్తున్నాయనే నమ్మకం కుదరడంతో దఫదఫాలుగా రూ. 67.83 లక్షలు పెట్టుబడి పెట్టాడు. స్క్రీన్‌పై లాభాలు కన్పిస్తున్నా, విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించడంతో రూ. 20.79 లక్షలు కమిషన్ చెల్లించాలని షరత్ విధించడంతో వాటిని కూడా చెల్లించాడు. దీంతో ఇలా మొత్త రూ.67.83 లక్షలు బాధితుడు మోసపోవడంతో మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సైనిక్‌పురికి చెందిన నిరుద్యోగి ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తుండగా స్టాక్ ట్రేడింగ్ వీడియో కనిపించింది. దానిని క్లిక్ చేయడంతో వాట్సాఫ్‌లో 'ఎస్ సెక్యూరిటీస్ డి-44' అనే పేరుతో ఉన్న గ్రూప్‌కు బాధితుడి నెంబర్ యాడ్ అయ్యింది. దీంతో బాధితుడికి స్టాక్స్ గూర్చి మేసేజ్‌లు పంపిస్తూ, గూగుల్ ఫామ్ పంపించారు, అందులో స్టాండెండ్ చార్టెడ్ గ్రూప్ 10 హై నెట్ వర్త్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ గూర్చి వివరిస్తామని వివరాలు పంపించాలని సూచించారు. దీంతో బాధితుడు ఫారమ్ నింపి పంపించడంతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, అందులో అకౌంట్ క్రియేట్ చేయించారు. మీరు పెట్టుబడి పెడితే భారీ లాభాలొస్తాయని నమ్మిస్తూ రూ.13 లక్షలు పెట్టుబడి పెట్టాంచారు. స్క్రీన్‌పై రూ. 23.14 లక్షలు కనిపించడంతో వాటిని విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించడంతో సైబర్‌నేరగాళ్లు నిరాకరించారు. ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు చేయడంతో మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రాణ రక్షణే లక్ష్యంగా.. పల్లెకో భద్రతా కవచం!

- రాజపేటలో కదిలిన యంత్రాంగం.. కదం తొక్కిన యువత
- రోడ్డు భద్రత గ్రామసభలకు విశేష స్పందన
- ప్రతి ఒక్కరి బాధ్యతగా సామూహిక ప్రతిజ్ఞలు

తొలివెలుగు, రాజపేట: రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. ఈ కోరలు చాస్తున్న మహమ్మారిని అడ్డుకోవడానికి పోలీసు శాఖ వినూత్న అడుగు వేసింది. పల్లెల్లోని ప్రతి పౌరుడిని రోడ్డు భద్రతలో భాగస్వామిని చేస్తూ రాజపేట మండలంలో సోమవారం 'రోడ్డు భద్రతా గ్రామసభలు' నిర్వహించారు. పోలీసు శాఖ ఆరు రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ మార్గదర్శకత్వంలో రాజాపేట పోలీసులు, సర్పంచులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. ఊరి భద్రత ఊరి చేతుల్లోనే ఉందన్న సంకల్పంతో గ్రామస్థాయి భద్రతా కమిటీలకు రూపకల్పన చేశారు. డాక్టర్లు, టీచర్లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, యువకులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించి, ప్రాణ రక్షణ బాధ్యతను వారికే అప్పగించారు. "ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తాం.. మా ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుతాం" అంటూ సభ్యులు, ప్రజలు చేసిన సామూహిక ప్రతిజ్ఞ సభలో స్ఫూర్తిని నింపింది. అనంతరం గ్రామస్తులంతా ఏకమై రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. ప్రమాదాలకు నిలయంగా మారిన తెరిచి ఉన్న బావులను మూసివేశారు. వాహనదారులకు ఇబ్బందిగా మారిన రోడ్ల పక్కని పొదలను తొలగించారు. డిజిటల్ యుగానికి తగ్గట్లుగా రోడ్డు భద్రత సమాచారం పంచుకోవడానికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు సైతం ఏర్పాటు చేశారు. రాజాపేటలో సర్పంచ్ కోయ మధు, కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఒక సామాజిక బాధ్యతగా జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో సరికొత్త చైతన్యాన్ని రగిలించింది.

పద్మశాలి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

తొలివెలుగు, రాజపేట: మండల కేంద్రంలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. సోమవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. పద్మశాలీల చిరకాల కోరికైన భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఆడెపు రాజు, బిర్రు బాలకిషన్, కోశాధికారి చుంచు నారాయణ, సహాయ కార్యదర్శులు బల్ల కృష్ణ, వార్డు సభ్యులు ఆడేపు గణేష్, డైరెక్టర్ స్వర్గం బాలకిషన్, నాయకులు వెంకటేశం, గోపి, ఉపేందర్, బొడ్డు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యపు సిరులు.. రైతు ముంగిటకే కొనుగోలు సేవలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- రాజాపేట మండలంలో ఐదు కేంద్రాలు ప్రారంభం



తొలివెలుగు, రాజాపేట: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. సోమవారం రాజాపేట మండలంలోని రేణికుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లూరు, రాజాపేట, సోమారం, కాల్వపల్లి, నర్సాపురం గ్రామాల్లోని కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకాల్లో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, ఏఎస్ఓ సురేష్ రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్, డీటీ నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు గౌడ్, విఠల్ నాయక్, ఆర్ఐ నరసింహులు, ఏఈఓ అంజయ్య, పీఏసీఎస్ సీఈఓ సిలివేరు చంద్రశేఖర్, సిబ్బంది శివరాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బీర్ల ఐలయ్య శ్రీకారం

- రాజపేట మండలంలో విస్తృత పర్యటన
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

తొలివెలుగు, రాజపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ. కోట్లాది వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారు.

గ్రామాల్లో పర్యటన వివరాలు:

చల్లూరు: ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం. అనంతరం స్థానిక గోశాలను సందర్శించారు. బేగంపేట: నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను సత్కరించారు. కాల్వపల్లి: సీసీ రోడ్డు ప్రారంభం, మహిళా భవనం శంకుస్థాపన, పీఏసీఎస్ సెంటర్ పాయింట్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం. అలాగే ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బసంతపురం & సోమారం: సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేమిల, పారుపల్లి & నర్సాపురం: ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడం.. ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం!

- ఎమ్మెల్యే అక్రమాలను ప్రశ్నిస్తే వేధింపులా?
- అభివృద్ధిని వదిలి కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు: తిరుమలేష్

తొలివెలుగు, రాజాపేట: సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం తగదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ హితవు పలికారు. సోమవారం మండల కేంద్రంలోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సాపురం మాజీ సర్పంచ్ నాగిర్తి గోపాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎమ్మ భాస్కర్ స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను ఎండగట్టినందుకు వారిపై కేసులు పెట్టడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ధ్యాస ఎమ్మెల్యేకు లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, అభివృద్ధిని అడిగితే పోలీసులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. నెల రోజులుగా తుంగతుర్తికి నీళ్లు వదులుతున్నా, తెగిపోయిన కాల్వపల్లి వాగు రోడ్డును పట్టించుకోకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గుర్తుచేశారు. కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, జస్వంత్, ఉప్పలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేత
- సంతాన నియంత్రణ ఆసుపత్రి ఏర్పాటుకు సామాజికవేత్త జగదీశ్వర్ విన్నపం

తొలివెలుగు, రాజాపేట: ఆలేరు నియోజకవర్గంలో రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడదను నివారించేందుకు ప్రత్యేకంగా సంతాన నియంత్రణ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సామాజికవేత్త మార్త జగదీశ్వర్ గుప్త కోరారు. సోమవారం ఆయన ప్రజలు, రైతులతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వినూత్నంగా వినతిపత్రాన్ని లామినేషన్ చేయించి అందజేస్తూ.. కోతుల వల్ల రైతులు, గ్రామీణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. గత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులు ప్రధానంగా కోతుల నివారణ హామీని ఇచ్చారని, కానీ పరిష్కారం లభించక నూతన పాలకవర్గాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సంతాన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విన్నవించారు. సామాజిక సమస్యపై జగదీశ్వర్ చూపుతున్న చొరవను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను జగదీశ్వర్ శాలువాతో సత్కరించారు.

ఆపన్న హస్తం.. దేవేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ. 11 వేల విరాళం అందజేసిన రాక్స్ యూత్ సభ్యులు

తొలివెలుగు, రాజాపేట: ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని రాజాపేట రాక్స్ యూత్ సభ్యులు చాటుకున్నారు. ఇటీవల మృతి చెందిన స్థానిక నివాసి దూస దేవేంద్ర కుటుంబాన్ని సోమవారం వారు పరామర్శించారు. దేవేంద్ర మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తూ, సభ్యులు సేకరించిన రూ. 11,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. యువత సామాజిక బాధ్యతతో స్పందించి సాయం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్తజాలలో రేషన్ షాప్ సబ్ సెంటర్ ప్రారంభం

- ప్రారంభించిన తహాశీల్దార్ వల్లపు ప్రదీప్

తొలివెలుగు, రాజాపేట: మండల పరిధిలోని కొత్తజాల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాప్ సబ్ సెంటర్‌ను తహాశీల్దార్ వల్లపు ప్రదీప్ సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే రేషన్ సరుకులు పొందేందుకు ఈ సబ్ సెంటర్ దోహదపడుతుందన్నారు. పౌర సరఫరాల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఠాకూర్ లావణ్య ధర్మేందర్ సింగ్, ఆర్ఐ నర్సింహులు, రేషన్ డీలర్ విజయ బాయ్, ఉప సర్పంచ్ ఠాకూర్ ధన్‌రాజ్ సింగ్, వార్డు సభ్యులు మొగిలి యాకయ్య, భాగ్య ఐలయ్య, చంద్రయ్య, వందన వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కొనుగోలు కేంద్రం, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

తొలివెలుగు, రామన్నపేట: రైతులు తాము పండించిన పంటను మద్దతు ధరకే విక్రయించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. సోమవారం రామన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పనలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాయక్, వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుల పిలుపు.. శివకు మృత్యుపాశం!

- నాటు పడవలో విహారం.. ఒక్కడే కొడుకు గల్లంతు
- పుట్టెడు దుఃఖంలో తల్లి మనోరమ్మ
- సకాలంలో స్పందించి ఐదుగురిని కాపాడిన గ్రామస్తుడు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: స్నేహితులతో కలిసి ఆనందంగా గడుపుదామనుకున్న ఆ యువకుడి సరదా ప్రాణాల మీదికి తెచ్చింది. మద్యం మత్తులో అదుపుతప్పి పడవ నీట మునగడంతో ఓ యువకుడు గల్లంతైన ఘటన సోమవారం గోస్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాండాల శివ(24) తన ఐదుగురు స్నేహితులతో కలిసి మద్యం సేవించి, గ్రామ శివారులోని చెరువులో ఉన్న నాటు పడవపై విహారానికి వెళ్లారు. తీరం నుంచి సుమారు 400 మీటర్ల దూరం వెళ్లాక పడవలోకి నీరు రావడంతో భయంతో అందరూ నీటిలోకి దూకారు. ఈత రాక వారు కేకలు వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన చెక్క వెంకటేష్ అనే వ్యక్తి గమనించి, తన బైక్‌పై తెప్పను తీసుకువచ్చి ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అయితే, శివ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఎస్సై భాస్కర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పనికి వెళ్తానని చెప్పి స్నేహితుల పిలుపుతో తిరిగి వచ్చిన కొడుకు కళ్లముందే నీట మునిగిపోవడంతో తల్లి మనోరమ్మ రోదనలు మిన్నంటాయి.

బలహీన వర్గాలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి
- పోచంపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: ఎన్నికల సమయంలో అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను మోసగించిందని బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి విమర్శించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో పురపాలక కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలపై అంబేద్కర్ విగ్రహం సాక్షిగా పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రాబోయే రోజుల్లో బలహీన వర్గాలే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల రవీందర్ రెడ్డి, డబ్బికార్ సాహిష్, చిక్క కృష్ణ, గంజి బసవలింగం, పల్లెకాడి బసవయ్య, చెరుకు వెంకటేశం, మేకల చొక్కారెడ్డి, ఏల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం.. ప్రాణాలకు రక్షణం!

- జనంపల్లిలో 'అరైవ్ అలైవ్' ప్రతిజ్ఞ
- రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి

తొలివెలుగు, రామన్నపేట: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ 2026'ను రామన్నపేట మండలంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జనంపల్లి గ్రామంలో రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చౌటుప్పల్ డీఎస్పీ ఎం.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రోడ్డు సేఫ్టీ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగరాజు, ఎంపీడీఓ రాములు, సర్పంచ్ బండ సరోజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు చేయూత.. నేహశ్రీకి నగదు పురస్కారం

- ఓరగంటి ఎట్టయ్య అంజమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీను గౌడ్
- ప్రభుత్వ కళాశాలలో చదివి ర్యాంకు సాధించడం అభినందనీయం

తొలివెలుగు, చౌటుప్పల్: విద్యలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ తరఫున ఎల్లప్పుడూ చేయూత అందిస్తామని ఓరగంటి ఎట్టయ్య అంజమ్మ ఫౌండేషన్ చైర్మన్ వరగంటి శ్రీను గౌడ్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తోర్పునూరి నేహశ్రీ ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ) ఫలితాల్లో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మెరిసింది. ఈ సందర్భంగా సోమవారం ఆమెను శ్రీను గౌడ్ ప్రత్యేకంగా అభినందించి, రూ. 5,000 నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ కార్పొరేట్ స్థాయి మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. నేహశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తొర్పునూరి మల్లేష్ గౌడ్, రవి గౌడ్, లింగస్వామి, రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ల హద్దులు తేల్చాలి

- తహాశీల్దార్‌కు పొన్కల్ గ్రామస్తుడి విన్నపం

తొలివెలుగు, జన్నారం: మండల పరిధిలోని పొన్కల్ గ్రామ పంచాయతీలో గల సర్వే నంబర్ల హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని కోరుతూ నోముల వేణుమాధవ్ సోమవారం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 363, 358 మధ్య సరిహద్దు వివాదం నెలకొందని ఆయన పేర్కొన్నారు. సర్వే నంబరు 358 గుండా సుధాకర్ అనే వ్యక్తి తన భూమిని కలుపుకుని చదును చేశారని, దీనివల్ల తమకు నష్టం జరుగుతోందని ఫిర్యాదులో వివరించారు. ఈ విషయంపై తహాశీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, త్వరలోనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు.

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

- వ్యక్తిగత కారణాలతో తప్పుకుంటున్నట్లు ప్రకటన
- పదేళ్ల సేవలకు ముగింపు: కంకల కిష్టయ్య

తొలివెలుగు, వలిగొండ: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంకల కిష్టయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత పది సంవత్సరాలుగా పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశానని ఆయన పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించానని, ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని అనివార్యమైన వ్యక్తిగత కారణాల వల్ల పదవిలో కొనసాగలేకపోతున్నానని వివరించారు. పార్టీకి పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించి, సేవలు అందించే స్థితిలో తాను లేనందున స్వచ్ఛందంగా అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని పార్టీ అధిష్టానం గమనించాలని కోరారు.

జిల్లా ప్రగతిలో డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి ముద్ర

- సమర్థవంతంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ
- పదోన్నతిపై వెళ్తున్న అధికారికి ఘనంగా వీడ్కోలు
- పాల్గొన్న అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వెంకారెడ్డి

తొలివెలుగు, యాదాద్రి భువనగిరి: జిల్లా పంచాయతీ అధికారిగా, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా విశేష సేవలు అందించిన విష్ణువర్ధన్ రెడ్డికి జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయన డీఆర్డీఓగా పదోన్నతి పొంది సూర్యాపేట జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ పంచాయతీల బలోపేతానికి, మౌలిక సదుపాయాల కల్పనకు విష్ణువర్ధన్ రెడ్డి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా గత పంచాయతీ ఎన్నికలను ఎలాంటి అవాంతరాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించడంలో ఆయన పాత్ర కీలకమని, రాష్ట్రంలోనే జిల్లాను పోలింగ్ శాతంలో ప్రథమ స్థానంలో నిలబెట్టడం ఆయన కార్యదక్షతకు నిదర్శనమని ప్రశంసించారు. అదనపు కలెక్టర్ వెంకారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించి, వివాదాలకు తావులేకుండా పరిష్కరించే తత్వం ఆయన సొంతమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్ఓ జయమ్మ, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతే ధ్యేయం.. ఊరూరా రక్షణ కమిటీలు

- చౌటుప్పల్ పరిధిలో 'అరైవ్ అలైవ్' సన్నాహాలు
- తొలిరోజు గ్రామాల్లో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ
- డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మన్మధ కుమార్ పర్యవేక్షణ

తొలివెలుగు, చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 'అరైవ్ అలైవ్-2026' కార్యక్రమం సోమవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘనంగా ప్రారంభమైంది. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన ఈ ఆరు రోజుల కార్యక్రమంలో భాగంగా తొలిరోజు గ్రామ, వార్డు స్థాయిల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఈ కమిటీల నియామకం జరిగింది. స్టేషన్ పరిధిలోని 26 గ్రామ పంచాయతీలతో పాటు, మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ఈ కమిటీలను నియమించారు. ఒక్కో కమిటీలో కనిష్టంగా ఎనిమిది మంది సభ్యులు ఉండగా.. ఇందులో ముగ్గురు మహిళలు, యువత, ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులను భాగస్వామ్యం చేశారు. కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామస్తులందరితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణమాల్, అజయ్ భార్గవ్, నర్సిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఘనంగా భూదాన్ వజ్రోత్సవ సన్నాహాలు

- మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే కుంభంలకు ఆహ్వానం
- 18న రామచంద్రారెడ్డి విగ్రహావిష్కరణ, భారీ ర్యాలీ
- హాజరుకానున్న జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: అహింసా మార్గంలో ఆచార్య వినోబా భావే ప్రారంభించిన చారిత్రక భూదానోద్యమానికి పుట్టినిల్లయిన భూదాన్ పోచంపల్లిలో వజ్రోత్సవ వేడుకలకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి భూదాత వేదిరె రామచంద్రారెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తూ, ఈ నెల 18న 'రామచంద్రారెడ్డి సేవా సమితి' ఆధ్వర్యంలో భూదాన్ 75వ జయంతి (వజ్రోత్సవాలు) కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలకు వారి కార్యాలయాల్లో నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, సేవా సమితి సభ్యులతో కలిసి ఈ మేరకు వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈనెల 18న నిర్వహించే జయంతోత్సవాలను రామచంద్రారెడ్డి సేవా సమితి, సర్వోదయ మండలి, సంఘమిత్ర సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు సేవా సమితి నాయకులు వెల్లడించారు. ఈ వేడుకల సందర్భంగా తొలి భూదాత వేదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పట్టణంలో భారీ భూదాన్ ర్యాలీ, ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ విశేష కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వారితో పాటు అఖిల భారత సేవా సంఘం మేనేజింగ్ డైరెక్టర్ మహాదేవ్ విద్రోహి, అఖిల భారత సర్వోదయ మండలి అధ్యక్షులు వేదిరి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భారత లవకుమార్, మాజీ ఎంపీటీసీ ప్రొఫెసర్ తడక యాదగిరి, రాష్ట్ర నాయకులు తోలుపునూరి కృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, సేవా సమితి గౌరవాధ్యక్షులు పోతగల దానయ్య, అధ్యక్షులు కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరగల కుమార్ తదితరులు పాల్గొన్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ వజ్రోత్సవాలను ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పేదలకు వరం ఇందిరమ్మ ఇళ్లు

- సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్, మధుసూదన్ రెడ్డి
- రూ. 86 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: నిరుపేదలకు సొంత గూడు కల్పించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇంటి పథకం' సామాన్యులకు గొప్ప వరంగా మారిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రథమ ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని వారు ఉద్ఘాటించారు. సోమవారం భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని ధర్మారెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గునుగుంట్ల శివ నిర్మించుకున్న ఈ నూతన ఇందిరమ్మ గృహాన్ని నాయకులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నూతన గృహప్రవేశం చేసిన దంపతులను ఆశీర్వదించి, వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సామాన్యులకు సొంతింటి కలను నిజం చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కాసుల జ్యోతికి మంజూరైన రూ. 86 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి వెంకటేష్ గౌడ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సుర్వి రాములు, స్థానిక నాయకులు అవనిగంటి శంకర్, గంగాపురం జంగయ్య, కొమరి విజయ్, కనక బోయిన మీన రాజ్, అవనిగంటి పెద్ద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- రోడ్డు భద్రతపై గ్రామాల్లో ప్రత్యేక కమిటీలు
- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి: ఎస్సై లక్ష్మీనారాయణ

తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం): మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని స్థానిక ఎస్సై ఎన్. లక్ష్మీనారాయణ కోరారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 'అరైవ్ అలైవ్-2026' కార్యక్రమంపై మంగళవారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రతను పర్యవేక్షించేందుకు 9 మంది సభ్యులతో నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురికావొద్దని హెచ్చరించారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

సన్‌రైజర్స్ చేతిలో ఓటమి తర్వాత రియాన్ పరాగ్ వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న (ఏప్రిల్ 13) జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో 57 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. ఈ ఓటమి రాయల్స్‌కు ఈ సీజన్‌లో మొదటిది. రాయల్స్‌ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో నాలుగింట గెలిచి, తాజా ఓటమి తర్వాత కూడా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ఈ ఓటమి తర్వాత రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సీజన్‌లో తొలి ఓటమి కావడంతో అతనిలో పెద్దగా సీరియస్‌నెస్ కనిపించలేదు. తప్పిదాలను ఒప్పుకుంటూనే ఓటమిని లైట్‌గా తీసుకున్నట్లు మాట్లాడాడు. సింగిల్ డిజిట్ స్కోర్‌కే సగం వికెట్లు కోల్పోయినా, బ్యాటింగ్ డెప్త్ అంటూ గొప్పలు పోయాడు. జడేజాకు బౌలింగ్ ఇవ్వకపోవడాన్ని, పిచ్‌ను అంచనా వేయలేకపోవడాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. సన్‌రైజర్స్ అరంగేట్రం సీమర్లను ప్రశంసించాడు.

అతని మాటల్లో.. వికెట్లు త్వరగా కోల్పోవడం

మేము వరుసగా వికెట్లు కోల్పోయాం. వారు బాగా బౌలింగ్ చేశారు. కొన్ని లెక్కలు తప్పాయి. దీన్ని ఒక చిన్న మినహాయింపుగా తీసుకుంటాం. ఎక్కువగా ఆలోచించం. 9 పరుగులకే 5 వికెట్లు కోల్పోయినా 159 పరుగులు చేయడం మా బ్యాటింగ్ లోతుకు నిదర్శనం.

పిచ్ పరిస్థితులు

కొత్త బంతి కాస్త స్టికిగా అనిపించింది. షైనింగ్ తగ్గాక స్లో అయ్యింది. ఓ రకంగా ఆలోచిస్తే, మొదట బ్యాటింగ్ చేయడం మంచిదై ఉండేది. ఏదిఏమైనా మేమే ఇంకాస్త మెరుగ్గా బ్యాటింగ్ చేయాల్సింది.

కొత్త సీమర్లపై ప్రశంస

సన్‌రైజర్స్ తరఫున అరంగేట్రం చేసిన సీమర్లు ప్రఫుల్ హింజ్, సకిబ్ హుస్సేన్‌కు నా అభినందనలు. వారు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశారు. ప్రేక్షకుల ఒత్తిడి ఉన్నప్పటికీ, మొదటి నాలుగుఐదు ఓవర్లలో చాలా బాగా బౌలింగ్ చేశారు. నేను వారిని ఎక్కువగా చూడలేదు. కానీ ఈ ప్రదర్శన అద్భుతం.

జడేజాకు బౌలింగ్ ఇవ్వకపోవడం

అప్పటికి ఇషాన్ బాగా ఆడుతున్నాడు. జడ్డూ భాయ్‌కి బౌలింగ్ ఇవ్వకపోవడానికి కారణాలు లేవు. బిష్ణోయిని నమ్మాను. వారు మేము అనుకున్న దానికంటే 30 పరుగులు ఎక్కువ చేశారు. ఈ ఓటమిని ఇక్కడితో వదిలిపెట్టి, తదుపరి మ్యాచ్‌లో మంచి ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధమవుతాం. మొత్తంగా రియాన్ మాటలను బట్టి చూస్తే.. ఈ ఓటమిని లైట్‌గా తీసుకున్నట్లు స్పష్టమవుతుంది.

ప్రఫుల్ ప్రచండ రూపం

హైదరాబాద్: ఐపీఎల్ తాజా సీజన్‌లో రెండు సార్లు 200కుపైగా స్కోరు చేసి కూడా ఓటమిని మూటగట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి భారీ స్కోరును కాపాడుకుంది. అయితే జట్టు బలహీనతగా కనిపించిన బౌలింగ్ విభాగం ఇప్పుడు మ్యాచ్‌ను గెలిపించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో ఇషాన్ కిషన్ బృందం 57 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్సులు) చెలరేగగా... హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్సులు) రాణించాడు. అనంతరం రాజస్తాన్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. డొనొవాన్ ఫెరీరా (44 బంతుల్లో 69; 7 ఫోర్లు, 3 సిక్సులు), రవీంద్ర జడేజా (32 బంతుల్లో 45; 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 72 బంతుల్లో 118 పరుగులు జోడించి పోరాడినా అది సరిపోలేదు.

కీలక భాగస్వామ్యం...

అభిషేక్ శర్మ (0) వెనుదిరిగిన తర్వాత ట్రవిస్ హెడ్ (18) కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అయితే ఇషాన్ మెరుపు బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఆర్చర్ ఓవర్లో 4, 6 కొట్టిన అతను బర్గర్, సందీప్ ఓవర్లలో ఒక్కో సిక్స్ బాదాడు. పవర్‌ప్లేలో జట్టు 51 పరుగులు చేయగలిగింది. ఇషాన్, క్లాసెన్ భాగస్వామ్యంలో రైజర్స్ ఇన్నింగ్స్ దూసుకుపోయింది. వీరిద్దరు మూడో వికెట్‌కు 39 బంతుల్లోనే 88 పరుగులు జోడించారు. బిష్ణోయ్ ఓవర్లో సిక్స్‌తో 30 బంతుల్లో కిషన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత తుషార్ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిపోయిన కిషన్... ఆ తర్వాత ఆర్చర్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. అయితే సెంచరీకి చేరువలో అతని ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత కొద్ది సేపటికే క్లాసెన్ కూడా అవుట్ కాగా, నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 28; 4 సిక్సులు) దూకుడుతో స్కోరు 200కు చేరువైంది. చివర్లో సలీల్ అరోరా (13 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సులు) మరికొన్ని కీలక పరుగులు జోడించాడు.

అభిషేక్ మళ్లీ డకౌట్...

సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ హైదరాబాద్ అభిమానులను మరోసారి తీవ్రంగా నిరాశపర్చాడు. సొంత మైదానంలో అతని మెరుపు బ్యాటింగ్‌ను చూసేందుకు ఎంతో ఉత్సాహంతో మైదానానికి వచ్చిన ఫ్యాన్స్ రెండో మ్యాచ్‌లోనూ డకౌట్‌ను చూడాల్సి వచ్చింది. లక్నోతో జరిగిన గత మ్యాచ్‌లో రెండో బంతికి సున్నా చుట్టిన అభిషేక్ ఈసారి తొలి బంతికే పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు.

నితీశ్ మళ్లీ మూడు సిక్సుల మోత...

హైదరాబాద్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో దిగ్వేశ్ రాఠీ వేసిన ఒకే ఓవర్లో మూడు సిక్సులు బాదిన నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌లోనూ అదే ఫీట్‌ను పునరావృతం చేశాడు. సందీప్ శర్మ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో లాంగాన్ మీదుగా రెండు వరుస సిక్సులు బాదిన అతను అదే ఓవర్ చివరి బంతికి డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లెగ్ దిశగా మరో సిక్స్‌తో తన ధాటిని ప్రదర్శించాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) బిష్ణోయ్ (బి) ఆర్చర్ 0; హెడ్ (సి) ఫెరీరా (బి) పరాగ్ 18; ఇషాన్ కిషన్ (సి అండ్ బి) సందీప్ 91; క్లాసెన్ (సి) పరాగ్ (బి) తుషార్ 40; నితీశ్ (సి) జురేల్ (బి) ఆర్చర్ 28; సలీల్ (నాటౌట్) 24; అనికేత్ (రనౌట్) 6; దూబే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 216. వికెట్ల పతనం: 10, 255, 3143, 4162, 5195, 6209.

బౌలింగ్: ఆర్చర్ 40372, బర్గర్ 40310, సందీప్ 40521, తుషార్ 40551, పరాగ్ 1051, బిష్ణోయ్ 30350.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) నితీశ్ (బి) సాకిబ్ 1; వైభవ్ (సి) అరోరా (బి) ప్రఫుల్ హింగే 0; జురేల్ (బి) ప్రఫుల్ హింగే 0; ప్రిటోరియస్ (సి) నితీశ్ (బి) ప్రఫుల్ హింగే 0; పరాగ్ (సి) అభిషేక్ (బి) ప్రఫుల్ హింగే 4; జడేజా (సి) అరోరా (బి) ఇషాన్ మలింగ 45; ఫెరీరా (బి) సాకిబ్ 69; ఆర్చర్ (సి) ప్రఫుల్ హింగే (బి) సాకిబ్ 2; తుషార్ (సి) కిషన్ (బి) ఇషాన్ మలింగ 25; బిష్ణోయ్ (సి) కిషన్ (బి) సాకిబ్ 0; బర్గర్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్) 159.

వికెట్ల పతనం: 11, 21, 31, 42, 59, 6127, 7129, 8140, 9140, 10159.

భారత్‌కు ఇరాన్ చమురు.. ఏడేళ్లలో తొలిసారి!

అమెరికా ఇటీవల ఇచ్చిన తాత్కాలిక అనుమతిని ఉపయోగించుకొని, ఇరాన్ నుంచి చమురు భారత్ పోర్టులకు మళ్లీ చేరడం ప్రారంభమైంది. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఇరాన్ చమురు భారతదేశానికి వస్తుండటం గమనార్హం. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ (రాజు+) షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. రెండు భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు భారత పోర్టులకు చేరుకున్నాయి. భారత పోర్టులకు చేరుకున్న రెండు ట్యాంకర్లలో.. ఒకటి ఇరాన్ జెండా ఉన్న 'ఫెలిసిటీ' అనే వాణిజ్య నౌక పశ్చిమ భారతదేశంలోని సిక్కా పోర్టుకు చేరింది. మరొకటి కురాకావో జెండా ఉన్న 'జయా' అనే నౌక ఒడిశా తూర్పు తీర పోర్టుకు చేరుకుంది. వాణిజ అనేది సుమారు రెండు మిలియన్ బ్యారెల్స్ చమురు రవాణా చేయగల భారీ నౌక. భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు దిగుమతిదారు. అయితే.. అమెరికా ఒత్తిడితో 2019 నుంచి ఇరాన్ నుంచి చమురు దిగుమతులు నిలిచిపోయాయి. ఇప్పుడు అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపు కారణంగా భారత రిఫైనరీలు మళ్లీ ఇరాన్ చమురు కొనుగోలు చేయగలిగాయి. ఈ మినహాయింపు ఏప్రిల్ 19న ముగియనుంది.

వార్ ఎఫెక్ట్.. పతనం వైపు బంగారం ధరలు!

పెరుగుదల దిశగా అడుగులు వేసిన గోల్డ్ రేటు ఈ రోజు (సోమవారం) తగ్గుదల వైపు పయనించింది. దీంతో బంగారం ధర కొంతమేర తగ్గింది. దీనికి కారణం యూఎస్ డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ఆందోళనలు అని తెలుస్తోంది. అమెరికా – ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలమవడం కూడా బంగారం ధరలు పెరుగుదలకు మరో కారణం అయింది.

శాంతి చర్చలు విఫలమైన తర్వాత, ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా – ఇరాన్ పోర్టుల నుంచి బయలుదేరే నౌకలను అడ్డుకుంటామని ట్రంప్ ప్రకటించగా, ఇరాన్ కూడా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరతను పెంచాయి. ఈ సంఘటనల వల్ల ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగి బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. చమురు ధరలు పెరగడం అంటే రవాణా ఖర్చులు, ఉత్పత్తి వ్యయాలు పెరగడం. దీని వల్ల ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే కేంద్ర బ్యాంకులు.. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్, వడ్డీ రేట్లు తగ్గించడానికి ఇష్టపడవు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటే, బంగారం వంటి ఆస్తులపై పెట్టుబడులు తగ్గుతాయి. అందువల్ల బంగారం ధరలు పడిపోయే అవకాశం ఉంది. 2026 ప్రారంభంలో భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఆ తరువాత క్రమంగా తగ్గుముఖం పట్టాయి. అయితే కియోసాకి వంటి విశ్లేషకులు గోల్డ్ రేటు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, పెట్టుబడిదారులు కూడా ఇందులో పెట్టుబడి పెడితే ధనవంతులవుతారని చెబుతున్నారు.